క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని ప్రేమ్‌నగర్, పోచమ్మకుంట, రెడ్డికాలనీ, బుద్ధనగర్, కొత్తూరు పాలజెండా, కుమార్‌పల్లి, కొత్తూరు ద్వారకా కాలనీ, జవహర్‌నగర్, సురేంద్రపురి, విష్ణుపురి, ఉషోదయ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వరంగల్‌లోని మట్వాడ, జ్యోతికాలనీ, భోగేశ్వరాలయం, పాపయ్యపేట చమన్, ఎల్లంబజార్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గ్రామాల వారీగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 12.30గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగనుందని పేర్కొన్నారు. ఈనెల 3న మునిపల్లిలో, 4న చింతగట్టు, 5న కోమటిపల్లి, భద్రకాళినగర్ గృహావసరాలకు కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే, 6, 7వ తేదీల్లో మునిపల్లిలోని వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

నేడు నగర సంకీర్తన

హన్మకొండ కల్చరల్: సమతాదీక్ష కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా వికాస తరంగిణి ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నగర సంకీర్తన నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 6గంటలు వరంగల్ బ్యాంక్‌కాలనీలోని డాక్టర్ బచ్చు మురళీకృష్ణ గృహం నుంచి దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానం వరకు నగర సంకీర్తన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

4న రాజ్యాంగం - పరిపాలనపై సదస్సు

విద్యారణ్యపురి / హన్మకొండ: శారదా కృష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్టు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం – పరిపాలనపై ఈనెల 4న హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో సదస్సు నిర్వహించనున్నారు. సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు హాజరై భారత రాజ్యాంగం – సాంస్కృతిక వికాసం, పరిపాలనా ధోరణులు అనే అంశంపై ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, సామాజిక వేత్తలు, విద్యావంతులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో 'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్ర


వరంగల్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో రైతు కూలీలకు పేద వర్గాలకు నష్టం జరుగుతుందని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మోదీ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం నిధులు కోత పెడుతూ ఆ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



కేయూ క్యాంపస్: ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని పలువురు వక్తలు సూచించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు ఆయుష్మాన్ భవ పేరుతో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు మాట్లాడుతూ సమాజంలో మధుమేహ వ్యాధి తీవ్రత పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలో కూడా ఈ వ్యాధి వస్తుండటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ప్రజలు సమతుల ఆహారం తీసుకుంటూ వ్యాయామం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృపాల్, సందీప్, సుష్మ, సౌజన్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన భద్రాద్రి ఎస్పీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

వేగం కన్నా ప్రాణం ముఖ్యం

- వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రాథోడ్, రవీందర్



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంవీఐలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

మామునూరు: ద్విచక్ర వాహనంపై త్రిపుల్ రైడింగ్ చట్టరీత్యా నేరమని, వేగం కన్నా ప్రాణం ముఖ్యమని, విలువైన ప్రాణాలను కాపాడుకోవడానికి నిత్యం అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రాథోడ్, కోల రవీందర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీఓ రంగారావు ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో పున్నేలు క్రాస్‌లోని ఏకశిల హైస్కూల్‌లో రోడ్డు భద్రతపై వ్యాసరచన, చిత్రలేఖనం, స్లోగన్స్, ఉపన్యాస పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై వినియోగదారులు అవగాహన పెంచుకుంటే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. వాహనాన్ని నడిపే సమయంలో ఆలోచనలు తగ్గించి డ్రైవింగ్‌పై ఏకాగ్రత పెట్టాలని అన్నారు. జనవరి 15నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరగనున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు వేడుకల్లో నాలుగు అంశాలపై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి, ఏఎంవీఐలు శాలిని, స్వర్ణలత, హోంగార్డులు, ఏకశిల స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

రామన్నపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ భోజరాజు సూచనల మేరకు సీకేఎం కళాశాల నుంచి దేశాయిపేట రోడ్డు మార్గంలో ఇసుక ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాలను అతివేగంగా నడపవద్దని, రోడ్డుపై ఇసుక పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకునే చర్యలకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన 'అధికారులు'



బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు

హసన్‌పర్తి: గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ పాలకవర్గం గడువు గురువారం ముగియడంతో ఆయా పంచాయతీలకు ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం కేటాయించింది. హసన్‌పర్తి మండలంలో 15 పంచాయతీలు ఉన్నాయి. అన్నాసాగరం గ్రామానికి ఎ.అనురాధ (వ్యవసాయాధికారి), అర్వపల్లికి టి.జయశ్రీ (ఆర్అండ్‌బీ ఏఈఈ)బైరాన్‌పల్లికి మానస (ఉద్యానశాఖ అధికారి), గంటూరుపల్లికి క్రాంతి (పశువైద్యాధికారి, హసన్‌పర్తి), హెచ్‌సీఎన్ తండాకు డాక్టర్ అర్చన(పశువైద్యాధికారి, సిద్దాపురం), జయగిరికి శ్రీనివాస్ (పీఆర్, ఏఈఈ), కొత్తపల్లి, మల్లారెడ్డిపల్లికి రామకృష్ణ (మండల అభివృద్ధి అధికారి), మడిపల్లికి హంజ (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ), నాగారం గ్రామానికి జి.రవిబాబు (మండల పంచాయతీ ఆఫీసర్), పెంబర్తికి శ్రీనివాస్‌రావు (నీటిపారుదల శాఖ,ఏఈ), సీతంపేటకు సీహెచ్.ప్రసాద్ (తహసీల్దార్), సీతానాగారానికి డి.కిశోర్(నీటిపారుదల శాఖ, ఏఈ), సిద్ధాపురానికి ఎన్.సుధ (ఆర్‌డబ్ల్యూ, ఎస్ఏఈఈ), సూదన్‌పల్లికి ఎండీ రహీం (డిప్యూటీ తహసీల్దార్)ను నియమించారు.

సేవలను ప్రజలు మరిచిపోరు

మెరుగైన సేవలు అందించిన వారిని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ అన్నారు. ఐదేళ్ల పాటు ప్రజాసేవ చేసిన జయగిరి గ్రామపంచాయతీ కార్యవర్గాన్ని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాణి, ఏఈ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



టెలి కాన్ఫరెన్స్‌లో వినయ్‌భాస్కర్, డివిజన్ అధ్యక్షులు

హన్మకొండ: పట్టభద్రులందరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కేటీఆర్ శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలపరిచే అభ్యర్థి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

కాశిబుగ్గ: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ 35వ డివిజన్ అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్ సూచించారు. డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, శ్రీరామ్‌రాజేష్, కొత్తూరు రాజేష్, బూత్ కన్వీనర్లు జన్ను గోవర్ధన్, కాగితోజు సోమన్న, లింగారెడ్డి, సంగి రమేష్, ఎండి.మున్నాభాయ్, భాస్కర్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి

మామునూరు: అక్రమంగా నిల్వచేసి మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.20,090 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ తెలిపారు. మామునూరు స్టేషన్ పరిధిలో వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన కత్తి సంతోష్ తన ఇంటిలో మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో దాడి చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై నిసార్ పాషా, మామునూరు ఎస్సై కృష్ణవేణి పాల్గొన్నారు.

తరాలపల్లిలో..

మడికొండ: తరాలపల్లిలో బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.6 వేల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడిలో టాస్క్ ఫోర్స్ సీఐ అల్లం రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా కృషిచేయాలి



కార్యక్రమంలో దామోదర్, ప్రిన్సిపాల్ ఖుర్షీద్

మడికొండ: విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కంజాపురం దామోదర్ సూచించారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల మడికొండ (వర్ధన్నపేట) పాఠశాలలోని విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లల మానసిక వికాసం 85శాతం కుటుంబ వ్యవస్థపైన ఆధారపడి ఉంటుందని చెప్పారు. ప్రతివిద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివితేనే ఉన్నతస్థానానికి చేరుకోవచ్చని వివరించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలబాలికలకు బాలల న్యాయ చట్టం (రక్షణ సంరక్షణ) ప్రకారం సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న బాలల తక్షణ పునరావాస చర్యల కోసం 1098 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ.ఖుర్షీద్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఎస్.భాస్కర్, ఔట్ రీచ్ వర్కర్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, ఉపాధ్యాయులు యాదగిరి, భాస్కర్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కాశిబుగ్గ: కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ మాదిగ చర్మకారుల లెదర్ పరిశ్రమల భూముల (లిడ్‌క్యాప్) దళిత అసైన్డ్ భూముల పరిరక్షణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాశిబుగ్గ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల చర్మకారుల జనరల్ బాడీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ 1994లో మొదటిసారిగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్మకారుల అభివృద్ధికి హైదరాబాద్ గచ్చిబౌలిలో 44ఎకరాల్లో లెదర్ పరిశ్రమను కేటాయించగా, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్మకారులకు మినీ లెదర్ పరిశ్రమల ఏర్పాటునకు పిలుపునివ్వడం అభినందనీయం అని కొనియాడారు. సమావేశంలో నాయకులు ఇమానుయేల్, ఇటికాల లత, గాదె కుమారస్వామి, మోతె స్వామి, బుక్క రమణ, నాగరాజు, శ్యామ్, ధనలక్ష్మి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన



గాజు పెంకులపై నడుస్తున్న ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజ్ఞానదర్శిని ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, సైన్స్‌పై విద్యార్థినులు, అధ్యాపకులకు అవగాహన కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌజన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానదర్శిని వ్యవస్థాపకుడు, హేతువాది రమేష్ పాల్గొని సైన్స్ ఆవశ్యకతను వివరించారని తెలిపారు. చేతబడి, దిష్టితగలడం, దెయ్యాన్ని ప్రాలదోలడం, మట్టిలో మంటను సృష్టించడం, నోటినుంచి శివలింగం తీయటం, గాజుపెంకులపై నడవటం వంటి అంశాల గురించి రమేష్ వివరించారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ సేవాపథకం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కవిత, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యానికి చిత్తడి నేలలు దోహదం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

హన్మకొండ అర్బన్: చిత్తడి నేలలు జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయని, అవి అనేక నీటి జాతి పక్షులు, చేపలకు ఆలవాలమని పాకాల అటవీ సంరక్షణ అధికారి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఈకో క్లబ్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిత్తడి నేలలు నీటిని శుద్ధి చేయడంలో మూత్రపిండాల మాదిరిగా పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వృక్షశాస్త్ర విభాగాధిపతి పార్వతి, ఈకో క్లబ్ కన్వీనర్ సరిత, క్లబ్ సభ్యులు మాధవి, పల్లవి, పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ భూములను రక్షించాలి



ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మడికొండ: హైదరాబాద్‌లో ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌లో మడికొండలోని వేణుగోపాల స్వామి ఆలయం భూముల అన్యాక్రాంతంపై మడికొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దువ్వ విజయ్, నాయకులు వినీత్, వినోద్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది రాజకీయ పలుకుబడితో భూములను వారి పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకొని పాసు పుస్తకాలు పొందారని పేర్కొన్నారు. కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన ఆలయానికి ధూప, దీప నైవేద్యం కోసం నాటి పాలకులు మడికొండ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 51, 52, 58, 59, 80లలో వరుసగా 1.36 గుంటలు, 2.01 గుంటలు, 0.24 గుంటల భూమి, 2.22 గుంటలు, 2.01 గుంటల భూమిని నాటి ఆలయ అర్చకులకు 2009వ సంవత్సరంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ రిజిస్ట్రేషన్ చేసిందని గుర్తుచేశారు. ఆలయ భూమిపై విచారణ జరిపించి భూ కబ్జాదారుల నుంచి ఆలయ భూమిని కాపాడి హద్దులు నిర్ణయించాలని కోరారు.

పర్యావరణ రుసుం నిలిపివేయడం హర్షణీయం



కాశిబుగ్గ: మేడారం జాతర ముగిసే వరకు పర్యావరణ రుసుం నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ అన్నారు. ఈమేరకు కనకదుర్గామాత దేవాలయం వద్ద నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వేరియా సురేష్, జంగం ప్రభాకర్, గుల్లపలి రామకృష్ణ, సర్దార్ జస్వీర్‌సింగ్, అన్వేష్, మణిదీప్, గూడ శారద, నళిని, ఉమ, భవాని, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని నిరంతరం కొనసాగించాలి



మొక్కలు నాటుతున్న డీఆర్వో గణేష్, డీఈఓ అబ్దుల్‌హై, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

హసన్‌పర్తి: వన మహోత్సవ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని జిల్లా రెవెన్యూ అధికారి గణేష్, డీఈఓ అబ్దుల్‌హై సూచించారు. హసన్‌పర్తిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం హరితహార కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ వేదిక (యూనిటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్), రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణాన్ని ఆకుపచ్చగా మార్చాలని సూచించారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత విద్యార్థినులు చేపట్టాలని చెప్పారు. జీఈసీఓ సునీత, స్పెషల్ ఆఫీసర్ స్వప్న, యూఎఫ్ఈపీ బాధ్యులు పురుషోత్తం, రాంబాబు, సంపత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం వెంకటయ్య, తదితరులు

ఖిలా వరంగల్: హనుమకొండ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లోని క్రీడా ప్రాంగణంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ బాలికల విభాగంలో ఖిలా వరంగల్ మధ్యకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రజిత, శ్రీహర్షిత పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని హెచ్ఎం వెంకటయ్య తెలిపారు. ఈనెల 3, 4వ తేదీల్లో మెదక్ జిల్లా తూప్రాన్ సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు వివరించారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో క్రీడాకారులు, కోచ్‌ను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

చిరు వ్యాపారాలతో ఉపాధి పొందాలి

కాజీపేట: మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రహదారులపై చిరు వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ ప్రధాన రహదారి పక్కన తమిళనాడు నాన్ – వెజ్ టిఫిన్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీవీ ఆర్టిస్ట్ విజయ్ యాదవ్, గబ్బెట శ్రీనివాస్, శశి, కరుణ్, దేవి, నిఖిల్ కుమార్, అశోక్, వివేక్, సన్ని, బన్ని పాల్గొన్నారు.

అట్టడుగు నుంచి ఉన్నత స్థాయికి..



మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ బన్న అయిలయ్య.. అట్టడుగుస్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ తెలిపారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బన్న అయిలయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తనిష్క్ స్టోర్ సందర్శన



హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని తనిష్క్ స్టోర్‌ను చినజీయర్ స్వామి శుక్రవారం సందర్శించి జ్యోతి ప్రజ్వలన చేసి మంగళ శాసనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. టాటా ఆభరణాల స్వచ్ఛత, పారదర్శకతను స్టోర్ ఫ్రాంచైజీ యశోద నారాయణరావు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పి.వి.నారాయణ రావు, గందె ఉమాశంకర్ పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి కళాశాలలో రక్తదానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మల్లేశం, తదితరులు

కరీమాబాద్: వరంగల్ ఉర్సు తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం పుట్టిన రోజును పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రక్తదానానికి అర్హులందరూ ముందుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కళాశాల డైరెక్టర్ తాళ్ల వరుణ్, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యుడు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు యజమానుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ప్రైవేట్ స్కూల్ బస్సుల యాజమాన్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వడుప్సా జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్ కోరారు. ఈమేరకు వరంగల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీఓ రంగారావును వడుప్సా, ప్రైవేట్ స్కూల్స్ బస్సుల ఓనర్లు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ, సీట్ల పరిమితి ప్రకారమే విద్యార్థులను క్షేమంగా ఇంటికి తరలిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడుప్సా, ట్రస్మా ప్రతినిధులు బిల్లా రవి, కోడెం శ్రీధర్, గాదె స్వరూప్‌రెడ్డి, ముక్కెర రవీందర్, దాసి సతీష్‌మూర్తి, కూరపాటి మోహన్, కూచన క్రాంతికుమార్, బండి చక్రపాణి, శ్రీనివాస్, వడిచర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్వెస్ట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్

హన్మకొండ: క్వెస్ట్ ఒలింపియాడ్‌లో రామన్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్ రామినేని తెలిపారు. 100లోపు ర్యాంకులను 14 మంది విద్యార్థులు, వేయిలోపు 200 మంది విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని వివరించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను కరస్పాండెంట్ రాజేష్ కుమార్, డైరెక్టర్ తీర్థాల పురుషోత్తం, ప్రిన్సిపాళ్లు రజిత, స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ అనుపమ అభినందించారు.